దక్కని 'గౌరవం'

- 22 నెలలుగా ఎంపీటీసీలకు అందని గౌరవ వేతనం
- ఎక్కువగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు ఉండటం వల్లే..
- ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించని వైనం



గడివేముల ఎంపీడీఓ కార్యాలయం

గడివేముల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటి వరకు ప్రజాప్రతినిధు లకు గౌరవ వేతనాలు ఇవ్వకుండా వారి సహనాన్ని పరీక్షిస్తోంది. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులే ఎక్కువగా ఉండడంతో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ కార్యక్రమాలపై తమకు సమాచారం ఇవ్వకుండా అవమానిస్తున్నారని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి వచ్చాక పెండింగ్..

గడివేముల మండలంలో 12 మంది ఎంపీటీసీలు, కల్లూరు మండలంలో 12, ఓర్వకల్లు మండలంలో 17 మంది ఎంపీటీసీలు, పాణ్యం మండలంలో 12 మంది ఎంపీటీసీలు ఉన్నారు. ప్రతి ఎంపీటీసీ సభ్యుడికి నెలకు రూ.3 వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సమయంలో రెండు విడతలుగా ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా పాలన చివరిలో గత ప్రభుత్వం ఎంపీటీసీలకు వేతనాలు చెల్లించలేక పోయింది. 2024 జూన్‌లో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అంతకు ముందు పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గౌరవ వేతనమే అందించ లేదు. దీంతో ఒక్కోసభ్యునికి రూ.66 వేలు ప్రభుత్వం బకాయి పడింది. రాష్ట్ర వ్యాప్తంగా కూటమి పార్టీల ఎంపీటీసీ సభ్యుల కంటే వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులే ఎక్కువగా ఉండడంతో వారికి న్యాయబద్ధంగా అందాల్సిన గౌరవ వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. వేతనాల కోసం వారంతా ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందిస్తున్నా స్పష్టమైన హామీ లేకపోవడంతో తమ గోడును ఎవరికి చెప్పాలో అర్థంకాక ఆందోళన చెందుతున్నారు. సంబంధిత మండల పరిషత్ అధికారులు వేతనాల కోసం బిల్లులు పెడుతున్నామని, రాష్ట్ర స్థాయి ఆర్థిక విభాగం నుంచి అవి విడుదల కావాలని చెబుతున్నారు.

ఎంపీటీసీలు లేకుండానే ప్రభుత్వ కార్యక్రమాలు..

ప్రజల చేత ఎన్నికై న ప్రజాప్రతినిధులమైనా తమకు ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంపీపీకి తెలియకుండానే మండలంలో పనులు, కార్యక్రమాలు నిర్వహించడం, దానిపై సర్వసభ్య సమావేశంలో పెద్ద ఎత్తున దుమారం రేగిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. అధికారులు చేపట్టే కార్యక్రమాల్లో టీడీపీ నాయకులకు ఇచ్చిన ప్రాధాన్యం తమను లెక్కచేయడం లేదని ఎంపీటీసీలు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి సర్వసభ్య సమావేశాలకు హాజరు కావడమే తప్ప... తాము చెప్పి సమస్యలను పరిష్కరించడం లేదంటున్నారు. గౌరవవేతనం విడుదల చేయకుంటే నియోజకవర్గంలోని ఎంపీడీఓ కార్యాలయాల ఎదుట ఆందోళన చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ఎంపీటీసీ సభ్యులు చెబుతున్నారు.

బిల్లులు పెడుతున్నాం

ఎంపీటీసీలకు గౌరవ వేతన బకాయిలు ఉన్న మాట వాస్తవమే. బడ్జెట్ రావడంతో ఎప్పటికప్పుడు బిల్లులు పెడుతున్నాం. గత నెల వరకు కూడా బిల్లులు పెట్టేశాం. గౌరవ వేతనాలకు సంబంధించిన గ్రాంట్ విడుదల కాగానే వారికి అందిస్తాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. ఎంపీటీసీ సభ్యులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వానికి, అధికారులకు ఎంపీటీసీ సభ్యులంటే చిన్నచూపు ఉండదు. వారి సమస్యలను పరిష్కరించడమే మా బాధ్యత.

–వాసు దేవ గుప్తా, ఎంపీడీఓ, గడివేముల మండలం

గౌరవ వేతనం మంజూరు చేయాలి



ఎంపీటీసీలకు కూటమి ప్రభుత్వం గౌరవ వేతనాలతోపాటు నిధులు, అలవెన్సులు కూడా ఇవ్వడం లేదు. గత ప్రభుత్వం సకాలంలో వేతనాలు, ప్రయాణ అలవెన్సు అందించింది. గ్రామాల్లో మాకు గౌరవం లేదు దీనికి తోడు మాకు రావాల్సిన వేతనం లేదు. వెంటనే మాకు రావాల్సిన వేతనాలు మంజూరు చేయాలి.

–.శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, కరిమద్దెల

బాధ్యత అధికారులదే



ప్రజా సమస్యలను అధికారుల వద్దకు తీసుకెళ్లి వాటిని పరిష్కరించేందుకు ప్రజలు మమ్మల్ని ఎంపీటీసీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులకు వారి పదవిని బట్టి తగిన గౌరవ వేతనాలు అందించి గౌరవించడం ప్రభుత్వం, అధికారుల బాధ్యత. వారికి ఎప్పటికప్పుడు వేతనాలు ఇవ్వాల్సి ఉంది. ఎంపీటీసీలకు గౌరవ వేతనం ఇవ్వకుండా బకాయి పెట్టడం ఎంత వరకు సమంజసం. కూటమి ప్రభుత్వం మాకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలి.

– మునిస్వామి, ఎంపీటీసీ పెద్దటేకూరు, కల్లూరు మండలం

ఎంపీటీసీలంటే చిన్నచూపు



రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను చిన్నచూపు చూస్తోంది. మాకు రావాల్సిన వేతనాలు చెల్లించడానికి మేమే ప్రాధేయపడాలా?. మహిళా ప్రజాప్రతినిధులుగా రాణించాలంటే ప్రభుత్వం తగిన సహకారం అందించాలి. వేతనాల బిల్లులు పెడుతున్నా మంజూరు చేయకపోవడం దౌర్భాగ్యం. ఇకనైనా న్యాయబద్ధంగా రావాల్సిన మా వేతనాలు విడుదల చేయాలి.

–నాగమద్దమ్మ,ఎంపీపీ,గడివేముల మండలం

క్లుప్తంగా

వ్యవసాయాధికారుల సలహాలు పాటించండి



బిలకలగూడూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: రైతులు పంటల సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ పవన్ కుమార్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో రైతులతో కలిసి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ స్థానిక రైతు సేవాకేంద్రాల్లో త్వరలోనే యూరియా అందుబాటులోకి తీసుకోస్తామన్నారు. గ్రామాల్లో కౌలుకు తీసుకున్న రైతులందరూ ఆయా గ్రామాల్లోని వీఆర్వోల వద్ద దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ జయరాజ్ పాల్గొన్నారు.

చెత్త సేకరణ సక్రమంగా జరగాలి

కల్లూరు: గ్రామాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగాలని కర్నూలు డీఎల్‌డీఓ రమణారెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. బుధవారం ఎంపీడీఓ నాగేశ్వరచలరెడ్డితో కలిసి పెద్దకొట్టాల గ్రామంలో పర్యటించారు. వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు వేరుగా అందించాలని ప్రజలకు సూచించారు.

బీఎల్‌ఓలకు శిక్షణ



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ ఆంజనేయులు

పాణ్యం: ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేసే సమయంలో క్షుణ్ణంగా పరిశీలించాలని మాస్టర్ ట్రైనర్, కల్లూరు తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. బుధవారం పాణ్యం ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్‌ఓలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్ చేయాలన్నారు. అలాగే ఫారం–7కు సంబంధించి ఆయా బీఎల్‌ఓల పరిధిలో ఉన్న ఓటరు జాబితాను పరిశీలించి, చూట్టు పక్కల విచారణ చేసుకొని, చనిపోయిన వారు ఉంటే తొలగించాలన్నారు. అనంతరం ఉత్తమ బీఎల్‌ఓలకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ అనురాధ, పాణ్యం తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



విద్యార్థికి బహుమతి అందిస్తున్న అధికారులు

కల్లూరు : ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని నాబార్డు డీజీఎం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఉలిందకొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగానహ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డు డీజీఎం సుబ్బారెడ్డి, జిల్లా కో–ఆపరేటివ్ ఆఫీసర్ వెంకటకృష్ణ, సీఈఓ రామాంజనేయులు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామచంద్రరావు, సీఎస్‌హెచ్‌జీ, జెఎల్‌జీ, సహకార సంఘం సేవలు గురించి వివరించారు. సహకార సంఘాల గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించారు. విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఈఓ ఆరిఫ్ బాషా, దేవదాసు, సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణికి అరుదైన చికిత్స

కర్నూలు(హాస్పిటల్): హైరిస్క్ సమస్యలతో ఆసుపత్రికి వచ్చిన ఓ గర్భిణికి వైద్యులు సిజేరియన్ ద్వారా ప్రసవం చేసి ప్రాణాలు కాపాడారు. చికిత్స వివరాలను బుధవారం స్థానిక అమీలియో హాస్పిటల్‌లో ఆసుపత్రి ఎండీ డాక్టర్ సి.లక్ష్మీప్రసాద్ వివరించారు. 'అధిక రక్తపోటు, ప్లేట్‌లెట్ కణాలు తగ్గిపోవడం వంటి సమస్యలతో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన గర్భిణి స్వప్న అమీలియో హాస్పిటల్‌లో చేరింది. గర్భిణికి ప్లేట్‌లెట్ కణాలు 1.50 లక్షలు ఉండాల్సి ఉండగా కేవలం 20 వేలు మాత్రమే ఉన్నాయి, బీపీ 200/140తో పాటు అధిక రక్తస్రావంతో బాధపడుతోంది. వాటన్నింటినీ నియంత్రించి గైనకాలజిస్టు డాక్టర్ మాబూని, అనస్తీషియా వైద్యులు డాక్టర్ విజేత సిజేరియన్ ద్వారా ప్రసవం చేశారు. అలాగే ఈ నెల 3న కడుపునొప్పితో బాధపడుతున్న 12 ఏళ్ల బాలికకు రిసిక్షన్ అండ్ అనాస్టమోస్ ఆపరేషన్ చేసి ఉపశమనం కలిగించినట్లు ఆయన వెల్లడించారు.

ఆర్‌యూ సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు బుధవారం ఎంపీ నాగరాజును ఆయన స్వగృహంలో కలిశారు. వర్సిటీలోని సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను పరిష్కరించి వర్సిటీ అభివృద్ధికి సహకరిస్తారని ఎంపీ హామీ ఇచ్చారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



జిల్లా మహాసభల కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

కోడుమూరు రూరల్: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ మండల కార్యదర్శి రాజు అన్నారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో సీపీఐ జిల్లా మహాసభల పోస్టర్లు, కరపత్రాలను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఆగస్టు 9, 10, 11వ తేదీల్లో కర్నూలులో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సీపీఐ నాయకులు దూళ్ల భాస్కర్, రాముడు, సులోచనమ్మ, సుంకన్న, వెంకటేశ్వర్లు, మధు తదితరులు పాల్గొన్నారు.

పులకుర్తి ఎత్తిపోతల నుంచి నీటి మళ్లింపు

సి.బెళగల్: మండలంలోని తుంగభద్ర నది నుంచి పులకుర్తి ఎత్తిపోతల పథకంకు బుధవారం నీటి మళ్లింపును ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ప్రారంభించారు. మొదట గుండ్రేవుల గ్రామానికి చేరుకొని మోటర్లకు పూజలు నిర్వహించారు. అనంతరం స్విచ్ ఆన్‌చేసి నది నీటిని పులకుర్తి ఎత్తిపోతల పథకంకు మళ్లించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ చిదాంబరరెడ్డి, ఏఈ శంకర్, డీసీలు మహేశ్వరరెడ్డి, ధర్మారెడ్డి, మధుసుదన్‌నాయుడు, ఆయా కాలువ సాగునీటి సంఘాల చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

కల్లూరు: సస్య రక్షణతోనే పంటలలో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణారావు అన్నారు. బుధవారం కల్లూరు మండలం కల్లూరు, పందిపాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు, డి.ఆర్.సి వ్యవసాయ అధికారులు ఎస్. సరోజ, శశిధర్‌రెడ్డి, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త రామకృష్ణారావు పత్తి పంట, కంది, మొక్కజొన్న పంటలను ఆశించే పురుగుల నివారణ, గులాబీ రంగు పురుగు నివారణ కోసం సమగ్ర సస్యరక్షణ గురించి రైతులకు వివరించారు. పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణ కోసం పసుపు రంగు, నీలిరంగు జిగురు అట్టలు ఎకరారకు 25 చొప్పున ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే గులాబీ రంగు పురుగు నివారణ కోసం ఎకరాకు పది చొప్పున లింగాకర్షణ బుట్టలు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, ఎంపీఈఓలు, రైతులు పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: ఖరీఫ్ కింద సాగు చేసిన పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా రసం పీల్చే పురుగులు, తెల్ల దోమ, పచ్చ దోమ, గులాబీరంగు పురుగును నివారించవచ్చని గూడూరు ఏఓ దస్తగిరి రెడ్డి సూచించారు. బుధవారం గూడూరు మండలంలోని మునగాల, మల్లాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులంతా ప్రతి రోజు పంటలను పరిశీలిస్తూ ఉండాలని, ఏవైనా చీడపీడలు సోకితే వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకు మందులను పిచికారీ చేసుకోవాలన్నారు.

వాసవీ సత్ర సముదాయానికి దాతలే దేవుళ్లు



టీజీ వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్న వాసవి సత్ర సముదాయం సభ్యులు

కర్నూలు (న్యూటౌన్): వాసవీ సత్ర సముదాయానికి దాతలే దేవుళ్లని వాసవిసత్ర సముదాయం గౌరవ అధ్యక్షులు టీజీ వెంకటేష్ అన్నారు. సత్రాల్లో భక్తులతో పాటు దాతలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా వసతి ఏర్పాట్లు చేయాలని కోరారు. బుధవారం కర్నూలులో జరిగిన వాసవీ సత్రసముదాయం సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వాసవీసత్ర సముదాయం అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ నెలలో తిరుపతి, విజయవాడలోనూ తమ సంస్థకు సంబంధించి అన్న సత్రాలు ప్రారంభమవుతాయన్నారు. ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి ఇల్లూరు లక్ష్మయ్య మాట్లాడుతూ భవిష్యత్తులో అరుణాచలం, అయోధ్య, మంత్రాలయం, యాదగిరిగుట్టలో తమ సంస్థలు ఏర్పాటు చేసేందుకు స్థలం పరిశీలిస్తున్నామన్నారు. పంగులూరు సీతమ్మ డెవలప్‌మెంట్ అసోసియేషన్ తరపున తిరుపతిలో రూ.40 కోట్లు విలువ చేసే స్థలం వాసవి సంస్థకు 30 ఏళ్లకు ఎంఓయూ రిజిష్టర్ డాక్యుమెంటస్ అందజేశామన్నారు. అక్కడ తిరపతికి వచ్చే యాత్రికులకు వసతి, అన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఆ సంస్థ సభ్యులందరూ కలిసి టీజీ వెంకటేష్‌కు కృతజ్ఞతలు తెలియజేసి, పూలబొకేలు అందజేసి శాలువాలతో సన్మానించారు.

పారిశుద్ధ్యం నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



కొండాపురంలో పారిశుద్ధ్య నిర్వహణపై సూచనలు చేస్తున్న డీఎల్‌పీఓ లక్ష్మి

సి.బెళగల్: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీఓ లక్ష్మి హెచ్చరించారు. బుధవారం ఆమె మండలంలోని కొండాపురం గ్రామ పంచాయతీలో పర్యటించి, సర్పంచ్ రత్నమ్మ చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను తనిఖీ చేశారు. తర్వాత పల్‌దొడ్డి గ్రామ శివారులో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి వానపాముల ఎరువుల తయారీ, చెత్త నిర్వహణ అంశాలపై పంచాయతీ కార్యదర్శి రజేష్‌కు సూచనలు చేశారు. ఆయా గ్రామాల్లో ప్రజలకు పరిశుభ్రత, ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు.



ప్యాలకుర్తిలో పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్ : గ్రామాల పరిశుభ్రతకు ప్రజలంతా సహకరించాలని కోడుమూరు ఎంపీడీఓ రాముడు కోరారు. బుధవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో పర్యటించి పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్తులు ఎక్కడ పడితే అక్కడ చెత్త పారవేయకుండా తమ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ రిక్షాల్లో మాత్రమే వేయాలని కోరారు. అనంతరం 'నమస్తే డే' కార్యక్రమంలో భాగంగా ప్యాలకుర్తిలో ఇంటింటి నుంచి చెత్త సేకరించే పారిశుద్ధ్య కార్మికులను దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట భద్రత



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఓర్వకల్లు : రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 17న నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం, మల్యాల పర్యటనకు రానున్న నేపథ్యంలో ఓర్వకల్లు విమానాశ్రయంలో పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు జిల్లా అధికార యంత్రాంగం తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఓర్వకల్లు విమానాశ్రయంలో అధికారులు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పరిశీలించారు. పోలీసు బందోబస్తు, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, ఆర్డీఓ సందీప్‌కుమార్, డీఎస్పీలు బాబుప్రసాద్, భాస్కర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ తేజమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అపర భగీరథుడు వైఎస్సార్

కర్నూలు (సిటీ): రాయలసీమ జిల్లాల్లో సాగు, తాగునీటి అవసరాల కోసం దూరదృష్టితో హంద్రీ – నీవా సుజల స్రవంతి పథకాన్ని చేపట్టి అపర భగీరథుడుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి నిలిచారని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి మరణం తర్వాత హంద్రీ – నీవా కాలువ పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో నందికొట్కూరు ఎమ్మెల్యేగా తాను కీలక పాత్ర పోషించానన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎదిరించినా పోతిరెడ్డిపాడును విస్తరించి ఎస్‌ఆర్‌ఎంసీ కెనాల్‌ను వెడల్పు చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. తన రాజకీయ గురువు వైఎస్సార్ బాటలో నందికొట్కూరు నియోజకవర్గంలో 32 వేల ఎకరాలకు ఏడు ఎత్తిపోతల పథకాలు నిర్మించి సాగునీరు అందించామన్నారు. ప్రజల్లో మంచి పేరు ఉండాలని ఆశించి నందికొట్కూరు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశానన్నారు. ఈ రోజు సీఎం చంద్రబాబునాయుడు మల్యాల వద్ద శ్రీశైలం నీటిని హంద్రీ – నీవా ద్వారా పంపింగ్ చేసేందుకు వస్తున్నారంటే అది ఆనాడు వైఎస్సార్ ఆలోచనతో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌ను నిర్మించడంతోనేనని స్పష్టం చేశారు. ఈ రోజు రాయలసీమలోని నాలుగు జిల్లాలతో పాటు కుప్పం వరకు సాగునీరు వెళ్తోందన్నారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యతివ్వాలి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో రాయలసీమ బ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటరామరాజు కోరారు. రాజకీయంగా పూర్తి వెనుకబాటుకు గురవుతున్న రాయలసీమలోని బ్రాహ్మణులకు అవకాశాలు కల్పించాలన్నారు. బుధవారం ఇక్కడకు వచ్చిన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్‌ను కలిసి పలు విషయాలను తెలియజేసినట్లు ఆయన చెప్పా రు ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని, బ్రాహ్మణ కార్పొరేషన్‌ను దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకురావాలని కోరినట్లు చెప్పారు. గతంలో ఉన్న అన్ని పథకాలను బ్రాహ్మ ణ కార్పొరేషన్ ద్వారా అమలు చేయాలని కోరామన్నారు. ఈ విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామని జనార్దన్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

సర్వే ఏడీపై విచారణ జరపాలి

కర్నూలు(సెంట్రల్): ఇటీవల జరిగిన విలేజ్ సర్వేయర్ల బదిలీల్లో చేతివాటం ప్రదర్శించిన సర్వే ఏడీపై శాఖాపరమైన విచారణ జరిపి సస్పెండ్ చేయాలని ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాము నాయక్, హౌసింగ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు హనుమన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం సర్వే ఏడీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన బదిలీల్లో రవితేజ అనే విలేజ్ సర్వేయర్‌ను మధ్యవర్తిగా చేసుకొని ఏడీ వసూళ్ల పర్వం కొనసాగించారన్నారు. ఫోకల్ స్థానాల కోసం లక్షన్నర నుంచి మూడు లక్షల వరకు డబ్బులు వసూలు చేసినట్లు చెప్పారు. డబ్బులు తీసుకొని కూడా బదిలీ చేయకపోవడంతో ఇచ్చిన డబ్బులు వెనక్కి ఇవ్వాలని అడిగితే తనకు ఇవ్వలేదని చెప్పడం అన్యాయమన్నారు. సర్వే శాఖలో జరిగిన అక్రమ బదిలీలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలన్నారు.

'పుర మిత్ర' ద్వారా సమస్యలు తెలియజేయండి

కర్నూలు (టౌన్): నగర ప్రజలు తమ సమస్యలను తెలియజేసేందుకు పుర మిత్ర యాప్‌ను ఉపయోగించుకోవాలని మంత్రి టీజీ భరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుర మిత్ర యాప్ ద్వారా సమస్యలను ఫొటో తీసి పోస్ట్ చేస్తే అధికారులు పరిష్కరిస్తారని పేర్కొన్నారు. వార్డుల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. 24 గంటల్లో సమస్యను పరిష్కారం అవుతుందని తెలిపారు. పారిశుద్ధ్యం, నీటి సరఫరా, వీధి దీపాలు వంటి సమస్యలను ఈ యాప్ ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావొచ్చని పేర్కొన్నారు.

చారిత్రక కట్టడాలను పరిరక్షించాలి



చర్చలో పాల్గొన్న జిల్లా మేధావులు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు జిల్లాలోని చారిత్రక కట్టడాలు, ప్రదేశాలను పరిరక్షించాలని ప్రొఫెసర్ ఎస్ మన్సూర్ రహమాన్ అన్నారు. బుధవారం సాయంత్రం పింగళి సూరన తెలుగుతోటలో జిల్లా మేధావుల ఆధ్వర్యంలో గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ కల్కూర అధ్యక్షతన జిల్లాలోని చారిత్రక కట్టడాలు, ప్రదేశాల పరిరక్షణ ఆవశ్యకతపై చర్చాగోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్రగల వారసత్వ సంపదగా ఉన్న ప్రభుత్వ భవనాలు జిల్లా పరిషత్, కర్నూలు మున్సిపల్ స్కూల్, ప్రభుత్వ గడియారం ఆసుపత్రి, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి నిర్వహణను గాలికొదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి గొప్ప భవనాలు కనిపించకుండా వాణిజ్య ప్రకటనల హోర్డింగ్‌లతో దాచిపెట్టారన్నారు. ఉస్మానియా కాలేజీ భవనానికి వారసత్వ ప్రదేశంగా, పెద్ద కడుమూరులోని రాయల చెరువును ప్రపంచ నీటి నిర్మాణంగా గుర్తింపు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. కేతవరం రాతిచిత్రాల పరిరక్షణ కోసం అక్కడి కొంత ప్రాంతాలలో జరుగుతున్న మైనింగ్‌ను ఆపేయాలన్నారు. ప్రపంచ వారసత్వ నీటి నిర్మాణమైన కేసీ కెనాల్ సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. ప్రాచీన ప్రార్థనా స్థలాలుగా చరిత్రకెక్కిన దేవాలయాలు, దర్గాలు, చర్చీలు, గురుద్వారాలు, జైన మందిరాలను అభివృద్ధి చేయాలన్నారు. కర్నూలు జిల్లా వైభవాన్ని తెలియజేసి, చారిత్రక కట్టడాల, ప్రదేశాల ప్రస్తుత స్థితిగతులను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. చర్చాగోష్టిలో రిటైర్డ్ జేడీ చంద్రశేఖర్, డీఎస్పీ మహబూబ్‌బాషా, రిటైర్డ్ డీఎస్పీ పాపారావు, విద్యాధర్, ఇమానుయేల్, రిటైర్డ్ డీఎం లాలెప్ప, మణికంఠ, రాముడు, డాక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సూచనలిస్తున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్: రైతు సేవా కేంద్రాల సిబ్బంది తమకు కేటాయించిన విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందితో ఏఓ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కింద అన్ని గ్రామాల్లోనూ రైతులు పంటలను సాగు చేశారన్నారు. అయితే, వాటికి అవసరమైన సలహాలు, సూచనల కోసం సిబ్బంది రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. అలాగే ప్రతి గ్రామంలో కూడా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి పంటల సాగులో అవసరమైన సలహాలు, సూచనలు రైతులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

నగరాన్ని కొత్త హంగులతో తీర్చిదిద్దాలి



మున్సిపల్ అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు (న్యూటౌన్): నగరాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్ది, 'న్యూ లుక్' తేవాలని మంత్రి టీజీ భరత్ అన్నారు. ఆయన బుధవారం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కర్నూలు నగరాన్ని విశాఖ తరహాలో తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. అభివృద్ధి పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ జాప్యం చేయొద్దన్నారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల పురోగతిపై ఆరా తీశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని, పనులను జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజ్‌విహార్ సమీపంలోని ఎల్లమ్మ గుడి నుంచి జమ్మిచెట్టు వరకు హంద్రీ నది ఒడ్డున నిర్మిస్తున్న రహదారి పనులను వేగవంతం చేయాలని, బండ్ మరింత పటిష్టంగా ఉండేందుకు జలవనరుల శాఖ అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. పార్కుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. డిసెంబర్ నాటికి 30 వేల మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. వెండర్ జోన్లను త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్ఓ జునైద్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన సర్పంచ్ బొగ్గుల సుశీలమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పసుపల గ్రామ పంచాయతీలో పని చేస్తున్న 21 మంది పారిశుద్ధ్య కార్మికులను సమస్తే (నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజేడ్ శానిటేషన్ ఎకోసిస్టమ్) కార్యక్రమంలో భాగంగా బుధవారం గ్రామ సచివాలయంలో సన్మానించారు. గ్రామ సర్పంచ్ బొగ్గుల సుశీలమ్మ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్ రెడ్డి కార్మికులకు శాలువా, పూల మాలలు వేసి సన్మానించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మాట్లడుతూ పారిశుద్ధ్య కార్మికులు అందరు సమస్తే యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.